కథానిక:

విజ్ఞానం: అజ్ఞానం

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు

అర్జంటుగా ఓ వంద రూపాయలు కావాలి.

పోనీ డబ్బయి, ఎనభై మధ్యనున్నా సరిపెట్టుకోవచ్చు. అవసరం నాకే. డబ్బు కావాలి. రేపటిలోగా కావాలి. తప్పని సరిగా కావాలి.

అంత డబ్బంటే తమాషా కాదని తెలుసు. అంత స్వల్ప వ్యవధిలో అంతకంటే ఎక్కువ ఖర్చుచేసిన దినాలు చాలా వున్నాయి యిదివరలో. కాని ప్రస్తుతారీఖు దాటి పదిరోజులన్నా కాలేదు. అప్పు చేయటం అలవాటు లేదు. తీరవలసిన బాకీలు తీరటం లేదు. ఎలా ? ఎలా ? ఎలా ?

బయట చాలా ఎండగా వుంది. లోపలకూడా వేడిగా వుంది. ఏళ్ళు ముదిరి, కీళ్ళు సడలిన పాత సైకిలును తొక్కుకుంటూ మళ్ళీ ఓ గంటలో ఆఫీసుకెళ్ళాలి. చనిపోతూ నాన్నగారు ఇచ్చిపోయిన ఆస్తి అదే. ఆయన జ్ఞాపకచిహ్నంగానూ, నా అవసరానికీ యింత వరకూ పదిలంగా దాన్ని వాడుకుంటున్నాను.

దాన్ని గురించి ఓ సమయంలో ఓ స్నేహితుడు జోక్ కూడా విసిరాడు.

"సైకిలును నువ్వు తోసుకెడుతున్నావా? సైకిలు నిన్ను తోసుకెడుతోందా?"

దానికి ఆలోచించి యిలా సమాధానం చెప్పాను.

"రెండూ జరుగుతున్నాయి. నాకు నీరసంగా వుంటే నన్నది తోసుకెడుతోంది, దానికి నీరసంగా వుంటే నేను తోసుకు తీసుకెడతాను."

పాపం! దెబ్బ తినేందుకు అందులో ఏమీ లేకపోయినా, ఎడమ చెంపమీద కుడిచేతితో ఓ దెబ్బ కొట్టినట్లుగా బాధపడి వెళ్ళిపోయాడు.

కాని ఆ విషయాలన్నీ యిప్పుడు నాకెందుకు? కొంచెం ఎక్కువగానే డబ్బు కావాలి.

కిటికీలోంచి ఎండవచ్చి నెత్తిమీదిగా బల్లమీదపడుతోంది. తలుపులు మూద్దామని వుందిగాని బద్ధకంగా వుంది. ఉపాయాలను నెమరువేస్తున్నాను, క్రొత్తవాటిని కల్పిస్తున్నాను. కాని అన్నీ మధ్యలోనే విరిగిపోతున్నాయి. కొన్ని చివరివరకూ కొనసాగాయి కాని మరీసాగటంవల్ల పలుచనై బలహీనమైపోయాయి. పదిహేను పాతిక మధ్య ఫలితంకనిపించే ప్లాన్లు చాలావచ్చాయి. కాని అవి చాలవు. కనీసం డెబ్భై కావాలి.

మూడు సంవత్సరాలక్రితం డిసెంబరులో మొదటివారంలో ఓరోజున యిలా రాశాను, డైరీలో.

"నిన్న నాన్నగారు చనిపోయారు. పోతూ యిలా అన్నారు. నాయనా ఎవరిదగ్గరా అప్పుచేయబోకు, ఎట్టి స్థితిలోనైనా సరే"

మూడు సంవత్సరాల తరవాత జనవరి రెండో తారీఖున ఎన్నోసారో యివాళ తడుతోంది." అప్పుచేసినందుకు ఫలితం ఆయనకు బాగా తెలుసు. అక్కయ్య పెళ్ళికోసం చేసిన అప్పుతోనే ఆయన వచ్చీరాని జరలో పడరాని పాట్లు పడ్డారు. అప్పు తీర్చి నాకోసం యీ చిన్న యిల్లు మిగిల్చేసరికి నవనాడులూ కృంగిపోయాయి. ఇంకా ఏదో యీ ఒక్క కొడుకుకోసం కొరగబెడదామని తాపత్రయపడుతూండగా స్టాలిన్‌లాంటి మహానుభావుడికి దాపురించిన భయంకరవ్యాధి సంక్రమించింది. ఆయనకూ మాకు ఋణం తీరిపోయింది.

ఆపదలో వున్నప్పుడు గడిచిపోయినరోజుల్లో చవిచూసిన కష్టాలూ, సుఖాలూ రెండూ జ్ఞప్తికి వస్తాయన్న మాట నిజమే. కాని కష్టాలకే బరువు ఎక్కువ. ఒక సుఖంరుచి కష్టాలను మరిపించగలదు. ఒక కష్టం వంద సుఖాలను మరిపిస్తుంది.

ఆసమయంలో ఆలోచనలకు అంతరాయం కలగజేస్తూ సున్నితంగా ఎవరో తలుపు తట్టారు. "ఎవరు?" అన్నాను.

తలుపుతోసుకుని పదేళ్ళ పిల్ల లోపలకు వచ్చింది.

జాలిగా, ముద్దుగా "ఏం కావాలమ్మా?" అన్నాను.

"ఓ రూపాయుంటే యిమ్మంది అమ్మ" ముద్దుగా, జాలిగా జవాబు.

జేబులు తడిమాను. మూడు రూపాయలు వున్నాయి. వాటిలోంచి ఒకటి తీసియిచ్చి ప్రేమగా చెక్కిలిమీద చిటికవేశాను. నవ్వి వెళ్ళిపోబోతోంది. చప్పున ఏదో తోచి, "పాపా మాట" అన్నాను.

పాప వచ్చింది.

"మీ నాన్నగారున్నారా యింట్లో?"

"ఆఫీసు కెళ్ళారుగా"

జవాబు విని "సరే వెళ్ళు" అన్నాను.

పాప వెళ్ళిపోయింది.

అదృష్టవంతుడి పరిసరాలు యిలానే వుంటాయి. పాప మంచిదే. కాని ఆమె వేసుకునేందుకు మంచి పరికిణీ, గౌనూ లేవు. పాప తెలివైందే. కాని ఆమె ఆరోతరగతి మించి చదువుకునేందుకు అవకాశం లేదు.

పాపనాన్న నాటకమైనా సంపాదించాడు. మాటకారి కాదు. ఆయనలో ప్రశ్నలోకమల్లా ఏమిటంటే పేదవాడు కావటం. ఈ పేద వాడు ఆ పేదవాడికి యిలు అద్దెకిచ్చాడు. అద్దె యిరవై రూపాయలు. మూడు నెలలునుంచీ ఒకాయి.

మూడు యిరవైలు అరవైలో సగం అయినా ఆయన యిస్తే ఎంతో బాగుంటుంది! ఇచ్చేందుకు ఆయనకు శక్తిలేదు. అడిగేందుకు నాకు శక్తిలేదు.

నానంగా గడుస్తోంది కాలం. విసుగ్గాకూడా గడుస్తోంది. ఉపాయాలు ఆలోచించటంవల్ల ఫలితం లేదని గ్రహించి మాని వేశాను. ఏదో ఒకటి చేసేయగలగటం ముఖ్యం. అద్దెకోసమన్నా పీడించాలి; అప్పన్నా చేయాలి.

మొదటిది సంభవం కాదు. రెండవది అసంభవం.

గంట గడిచింది. బరువుగాలేచి, తలుపులు తాళం వేసి సైకిలును ప్రయాసమీద స్టార్ట్ చేసి బయలుదేరాను. దారో— ఓసుసలమ్మగారు శాపనార్థాలు విసిరింది. ఏం జరిగిందో ఓయువతి ముసిముసి నవ్వులు నవ్వింది. ఇంకా కొన్ని ఘోరాలు జరగబోయి ఆగిపోయాయి. ఆఫీసుకు చేరాక బ్రేకువేసినా చక్రాలు తిరగటం మానటం లేదు. సింహద్వారానికి పదిహేనుగజాల దూరంగా దయ తల్చి, అప్పటికైనా విశ్వప్రయత్నం చేస్తే ఆగింది. మళ్ళీ వెనక్కి తోసుకొస్తూంటే ఎవరో యిద్దరు నవ్వారు. నన్నుచూసి నవ్వారో, సైకిలునుచూసి నవ్వారో నా కర్థం కానేలేదు.

మెట్లు మీంచి పైకి మోసుకొస్తూంటే ప్యూన్ ఎదురై యిలా అన్నాడు: "మీరేం మోస్తారు? బాబూ! నేను మోస్తాను."

సీటులో కూర్చున్నా ఆలోచన్లు మానవని తెలుసు. మానేందుకు ప్రయత్నించి ప్రయోజనం లేదని కూడా తెలుసు. అలా బాధపడుతూ అయిదింటివరకూ గడిపి ఫైల్సు అసంపూర్తిగా వొదిలేశాను.

వచ్చేటప్పుడు ఓపికలేక, సైకిలు నడిపించుకుంటూ నడు స్తున్నాను. కాఫీత్రాగుదామని అనిపించినా బద్ధకంవేసి మానేశాను. ఓ అరగంటలో యింటికివచ్చాను.

ఇంత విచారం! అబ్బ! ఎలా భరించటం!

పంతులుగారు గుమ్మం యివతల చాప వేసుకుని, పేపరు చదువుకుంటున్నారు. ఇది రోజూ జరిగేదే. రోజూ అయితే "విశేషాలేమిటండీ?" అని నేను అడగటం, పత్రిక వార్తలన్నీ ఒక దాని తర్వాత ఒకటి ఏకరువు పెడుతూ, ఆయన స్వంత అభి ప్రాయాలు కూడా వెలిబుచ్చటం, ఎక్కడైనా నేను ఆయన మాటల్తో అంగీకరించకపోతే, సున్నితంగా వాదించుకోవటం జరగడం రివాజు. ఇవాళ కూడా నేను పాతప్రశ్న అడగబోతానని తలంచి వుంటాడు. కాని నేను తొందరపడ్డాను.

"పంతులుగారూ ఓసారి యిలా వస్తారా?" అన్నాను.

ఓ విధమైన ఉద్రేకపు సన్నివేశాలకు నాందీవాక్యాలు యిలానే వుంటాయి. "నిన్నో విషయం అడగమంటావా?" అని అమ్మ హఠాత్తుగా ఉపక్రమించినప్పుడు ఆరోజుల్లో అలాగే ఉలిక్కిపడేవాడిని. "వరేయి యిటురా" అని నాన్నగారు పిలిచి నప్పుడూ గుండె గబగబ కొట్టుకునేది. ఇప్పుడు నా మాటల్ని విన గానే ఆయన ముఖంలో ఆ మాదిరి భయం స్పష్టంగా గోచరించింది.

"ఏమిటండీ?" అని దగ్గరకు వచ్చాడు.

భయంతో, బాధతో, సిగ్గుతో చచ్చినచావయింది. ఎంత కష్టమో. యిటువంటి సంఘటనలను ఎదుర్కోవటం! మరి కథల్లో చదివే, సినిమాల్లోనూ, నాటకాల్లోనూ చూసే ఆ కఠినత్వాలూ, దయాదాక్షిణ్యాలు లేకపోవటాలు నిజాలు ఎలా ఔతాయి? పంతులుగారిలాంటిమనిషి, ఆ కళ్ళజోడు అలా క్రిందకు జారి పోతూండగా, దీనమైనచూపులు చూస్తూండగా, ఆ అదురుతూ, వణుకుతూన్న కళ్ళూ......ఏ మానవుడి హృదయం ద్రవించదు? కనీసం...నాలో యిహ కాఠిన్యానికి తావులేదు.

"కొంచం...కొంచం...డబ్బు...సర్దగలరా?"

ఎలా వేశాను యీ ప్రశ్న? నేను కఠినుణ్ణికాదుగా. లేదు లేదు. ఈ ప్రశ్నలో ఆ భావంలేదు. బ్రతిమిలాడాను, వేడు కున్నాను, అర్థించాను—ఆ నాలుగు మాటల్లో.

"నాదగ్గర యిప్పుడెక్కడిది నాయనా?"...

చాలు—ఇంక నా నోరురాదు. "అనడంలోలేని ప్రేమ, జాలి, దీనత్వం యీ చివరి మూడక్షరాలలో అమితంగావున్నాయి.

"పర్వాలేదు. ఏమీ అనుకోకండి. ఎంతో అవసరంవుండి అడిగాను" అనేసి లోపలకువచ్చి కూలబడ్డాను. అడక్కుండా వుంటేనే మనశ్శాంతిగా వుండేది. ప్రయోజనంలేదని చాలాభాగం తెలిసే, నోరుజారి, మరోగుండెను గాయపరిచాను. కనీసం ఆత్మ సంతృప్తిఅయినా లేకపోయింది.

ఏడుపు, కోపం, వైరాగ్యం, ఉద్రేకం అన్నీ ఒకదాని తర్వాత ఒకటి ఆవహిస్తున్నాయి. వరుసగా వాటితో కుస్తీపట్టి అలిసిపోతున్నాను. కాని చివరి విజయం నాదికాలేదు. నన్ను ఉద్రేకం చిత్తుచేసింది.

"ఏమయినాసరే డబ్బుసంపాదించి తీరతాను" అని చివరి సారిగా దృఢంగా నిశ్చయించుకున్నాను. తలుపు తాళంపెట్టి సైకిలు తీసుకుని బయటకువచ్చాను. అప్పుడే చీకటిపడింది. పాప కాళంలేనప్పుడు టైము గబగబా గడిచిపోతుందన్నమాట నిజమే. ఆయాసంమాట మరిచిపోయి సైకిలు ఎంతవేగంగా త్రొక్కానో చెప్పలేను. భయంకరమైన పోలీసువాడి యీల వినబడగానే ఎడం చేత్తో బలంగా బ్రేకునొక్కాను. అతిప్రయాసమీద ఇరవై గజాలు దాటాక సైకిలు ఆగింది.

పోలీసువాడు రొప్పుకుంటూ వెనకనుంచి పరిగెత్తువచ్చి నన్ను వేసిన మొదటి ప్రశ్న యిది.

"నేను ఆగమనగానే ఎందుకు ఆగలేదు?"

నేను భయపడి "బ్రేకు పడలేదు" అని చెప్పాను.

పోలీసు స్ట్రీట్‌లైటు మసకవెల్తురులో నావంక క్రూరంగా చూసి "బ్రేకులు పడకపోవటం రెండవతప్పు" అన్నాడు.

కొంచెం చిత్తరగాలి "నా యింటిపేరు ఏమిటి?" అని అడిగాను.

"తెలియకుండానే అడుగుతున్నావన్న మాట. నైటు పేరేమిటి?"

అప్పుడు గుర్తువచ్చింది. పోలీసువాళ్ళందరూ స్త్రీ గంభీరంగా వుంది. సులభంగా వదిలేటట్లు కనబడలేదు. అయినా ఎట్లా? అనవసరంగా జంజాటంలో యిరుక్కున్నానే.

"తొందరగా వెడుతున్నాను. పొరపాటయింది. పోనీయండి" అన్నాను తగ్గి.

పోలీసు తలవ్వేదు వరకగా, దబాయింపు ప్రారంభించాడు. జామీద రెండు నేరాలు యింగానే మోపాడాయి. "చదువు కున్నవాడిలా కనిపిస్తున్నావు; ఆ మాత్రం తెలియదటయ్యా" అన్నాడు, "నిన్ను వదిలిపెడితే యివాళ, రేపటినుంచీ నెత్తికెక్కుతావు" అన్నాడు పదాల ప్రయోగం జాస్తిగాచేస్తూ. నా కర్థం గాకుండా కొన్ని నిమిషాలు ఏవేవో మాట్లాడాడు. పోనీ-అతని మాటలన్నీ భరిస్తూ వూరుకుంటే, వదిలిపెడతాడని నూపం వహించాను. అయిదు నిమిషాలు అలాతిట్టి "స్టేషన్‌కిపద" అన్నాడు.

నా వళ్లు ఝల్లుమంది. నా ఆలోచన్లు! ఆశలు! ఏమిటీ పీకు లాట? ఇంకా తగ్గి, దీనాతిదీనంగా "ఇంకెప్పుడూ చెయ్యను. వదిలేయండి" అన్నాను.

"అదేం లాభంలేదు. పద!"

నాకేం అర్థంగాక ఏమి చేయటమా అని ఆలోచిస్తున్నాను. ఇంతలో ప్రక్కనుంచి ఓ కీచుగొంతు వినిపించింది.

"ఏదో పోనియ్యండి, ఇంకెప్పుడూ చెయ్యనంటున్నారుగా.

చిన్న కిల్లీ దుకాణం. ఒక తీగకు లాంతరు తగిలించివుంది. వెలుగుతోంది. ఇద్దరు ముగ్గురు ప్రక్క నేలమీద వేసివున్న బెంచీ మీద కూర్చుని మావంక వినోదంగా చూస్తున్నారు. దుకాణదారు ఎవరికో కిల్లీ కట్టి యిస్తూ, మళ్లా యిలా అన్నాడు. "పాపం. వదిలేయండి".

"నీకేం తెలుసయ్యా, కూర్చుని కబుర్లు చెబుతున్నావు. అది నా డ్యూటీ?"

కిల్లీకొట్టు అతను అపహాస్యంగా నవ్వి అన్నాడు. "ఎంతడ్యూటీ అయినా పాపం-ఆయన ఏదో పనిలో వున్నట్లున్నారు. అర్జంటుగా వెడుతున్నట్లున్నారు?"

"అయితే లైటు వెలిగించుకో నక్కర్లేదా?"

కిల్లీకొట్టు అతను మళ్ళీ నవ్వి "ఏదో. పోనీయండి" అన్నాడు.

నాకు శరీరమంతా చెళ్లూ, జ్వరలూ పాకుతున్నట్లుగా వుంది. రోడ్డుమీద యింత అవమానం ఎలా భరించేది? ఇంకా కొంచంకాలం యిదే హీనపరిస్థితిలో వుంటే కన్నీళ్లు కారటానికి అడ్డంకి ఏముంది? ఛీ. విలువైనకాలం వృథా అయిపోతోంది. ఎనిమిది దాటితే నా పనిజరగదు. మళ్ళీ రేపు ఆదివారం. కష్టాలన్నీ ఒకసారే వస్తాయన్నమాట నమ్మక చేసేదేముంది?

"చూస్తూ నిల్చుంటా వేమయ్యా. పద" అన్నాడు మళ్ళీ పోలీసువాడు.

తెచ్చిపెట్టిన మొహంతో "సైకిలు లైటు లేకుండా తీసుకుపోతే ఏం జరుగుతుంది" అన్నాను.

అతను చిరునవ్వునవ్వి "కేసు కోర్టుకు పంపిస్తాం. తర్వాత ఫైన్ వేస్తారు" అన్నాడు.

"తప్పకుండా వెయ్యాలా?"

"వేసేది నీ అదృష్టం."

ఎంత అసహాయత నాది, ఇన్నాళ్ళనుంచి యిక్కడే గడిపాను. ఓ పోలీసువాడిబారినుండి తప్పించుకోలేకపోతున్నాను. నిజానికి యింత మామూలుగా మనిషిని పరిస్థితులు ఇరుకున పెట్టి కట్టిపడేస్తాయని ఎవరైనా ముందుగా ఊహించగలరా?

మళ్ళీ కిల్లీకొట్టుఅతను కలగచేసుకుని "పోనీ. నేనో ఉపాయం చెబుతాను. అలాచేయండి" అన్నాడు యిద్దరినీ ఉద్దేశించి అన్నట్లుగా.

నాలో ఆశ జనించింది. దీనికి మారుపేరే అమాయకత్వం.

"ఇప్పుడు మీరు పనిమీద వెడుతున్నారా పంతులుగారూ?"

తల బలంగా ఊపాను.

"నేను మంచివాడ్ని. ఆపాయంలో వున్నవాళ్లనిచూస్తే నాకేమిటో సహాయం చేయాలనిపిస్తుంది. చూడండి. రేపు నేను మీ బదులు కోర్టుకి వెడతాను. రెండో మూడో ఫైన్ వేస్తారు. అది యిప్పుడు మీరు నాకిచ్చెయ్యండి. ఏమండీ పోలీసాయనా, యిష్టమేనా?"

పోలీసు అయిష్టంగానే తలవూపి "నాకసలు యిటువంటి పనులు యిష్టంలేవు" అని కొంచంనసిగి "అయినా నీమాట కాదన లేకుండా వున్నాను" అన్నాడు.

"ఏదో నా మొహంచూసి వొప్పుకోండి."

"సరే" అన్నాడు యీసారి పోలీసు.

"అయితే మీరు నాకు మూడురూపాయ లిలా యివ్వండి."

శరీరం ఓ రెండు పరిచితభావాలతో దహిస్తుండగా నేను జేబులో చెయ్యిపెట్టి, వెతికి, "నాదగ్గర రెండు రూపాయలే వున్నాయి" అన్నాను.

"కష్టం" అన్నాడు పోలీసు.

"కష్టమే" అన్నాడు కిల్లీకొట్టు అతను.

"ఏంచేసేది? నాదగ్గర అంతకంటే లేదు."

వాళ్ళిద్దరూ కొంచంసేపు ఆలోచించాక, ఓక వొప్పందాని కొచ్చి "సరే. యిలా యివ్వండి. నేనేదో ఏర్పాటుచేస్తాను" అన్నాడు కిల్లీకొట్టు అతను. నేను మారుమాట్లాడకుండా రెండు రూపాయలుతీసి అతని కిచ్చేశాను.

"సరే యిహ వెళ్లండి. ఇంకెప్పుడూ లైటు లేకుండా వెళ్లకండి" అని పోలీసు బహువచనంలో వార్నింగు ఇచ్చాక పాలిపోయిన మొహంతో యివతలికి వచ్చిపడ్డాను. "దా వుతప్పి...." అంటే యిదే. "వాళ్ళభావ. అర్థంకానంతటి మూర్ఖుడ్నా" అని ప్రశ్న వేసుకుంటే చెప్పలేక నవ్వు రాలేదు.

నేను సైకిలును నడిపించుకుంటూ వెళ్ళేసరికి రామారావు కొట్లో కూర్చున్నాడు. అతనిదగ్గర నా అవస్థనంతా వెళ్ళబోసుకున్నాను. వాళ్లయింటికి కొంచెందూరంలో సైకిలుషాపు వుంది. రమ్మని చెప్పి అక్కడికు తీసుకుపోయాడు. అరగంట అటూయిటూ వచ్చాక బేరం కుదిరింది.

“నాన్నా! నన్ను క్షమించు” అనుకున్నాను మనసులో. అతికష్టంమీద డెబ్భయిరూపాయలకు ఆరాత్రి ఎనిమిదిగంటల ఐదు నిముషాలకు అమ్మేశాను. మొదట డబ్బుకు మరునాడు రావాలని అన్నాడు. ఈరోజే కావాలని పంతంపట్టాను. చివరకు ఒప్పుకున్నాడు. నాజేబులోకి రూపాయలు వచ్చాయి. రామారావుకి ధన్యవాదాలు చెప్పి యింటిదారి పట్టాను.

ఎనిమిది దాటిపోయింది. ఇహ! ఈరోజు దుకాణాలు మూసి వేసి వుంటారు. రేపు ఆదివారం. అయినా నాకు తెలిసిన షాపులు రెండుమూడు వున్నాయి. ఆమాత్రం సాధించలేకపోను.

బజారులో వెలుగూ, చీకటీ కలగలుపుగా వున్నాయి. మరి కొంచెంసేపటిలో యీ వెలుగును చీకటి జయిస్తుంది. కొన్ని పనులకు చీకటి మంచి సహాయకారి అయినా నాస్థితిలో వున్నవాడికి యెంత చికాకు కలిగిస్తుందో ఏం చెప్పను?

పంతులుగారి భాగం తలుపులు వేసివున్నాయి. లోపలమాత్రం మిణుకుమిణుకుమంటూ దీపకాంతి కనిపిస్తోంది. ఎలక్ట్రిసిటీవున్నా భరించలేక హరికేన్‌లాంతరుతో సరిపెట్టుకుంటున్నారు వాళ్ళు.

నాభాగం గుమ్మం ఎక్కటానికి రెండుమెట్లు యెక్కాలి. ఒకటి పెద్దమెట్టూ. రెండవది చిన్నదీ. పెద్దమెట్టుమీద ఓ స్త్రీ కూర్చునివున్నట్లు కనబడింది. కొద్దిగాజంకాను. “ఎవరూ” అన్నాను స్వరం చిన్నదిచేసి.

ఆస్త్రీ చప్పున లేచినిల్చుని “నేనురా మధూ” అంది.

క్షణంపాటు నేను నివ్వెరపోయాను. “తేరుకుని, వేగంగా తలుపులుతీసి, లైటు వేసి “లోపలకురా అక్కయ్యా” అన్నాను.

అక్కయ్య లోపలకు వచ్చింది. ఎంత దీనవదనం! మా అక్కయ్య వయస్సు ఇరవైఅయిదేళ్ళే అని ఎట్లా చెప్పుకోను? మా అక్కయ్య గొప్ప అందగత్తె అని ఎట్లా గర్వించను? సంవత్సరాల తరబడి అవలోకిస్తున్నట్టే యీనాడూ కన్నీటిచారలు అవలోకించ గలిగాను.

“కూర్చోవే” అన్నాను.

రూపంలోనేకాదు. అక్కయ్య కంఠస్వరంలోనూ మార్పు కొచ్చింది. ఇలా అంది. “నేను కూర్చునేందుకు రాలేదురా మధూ.”

“ఏమయిందే?” అన్నాను ఆదుర్దాగా.

“బావకు మరీ ఎక్కువగా వుంది.”

అబ్బ! ఎంత వేదన ఆ నేత్రాల్లో! అమ్మలాంటి అక్కయ్య దుఃఖాన్ని చూడటం నాకింతవరకూ చేతకాదు. అందుకే ఆమె రాకగానీ, ఆమె యింటికి పోకగానీ నాకిష్టంలేదని గట్టిగా అంటే యీ ప్రపంచం నన్ను కఠినుణ్ణని నిందినా, [illegible] తుంది.

ఒక్కొక్కసమయంలో ఆమె నాకంటే ఒక ఏడు పెద్దదన్న విషయం మరిచిపోతాను. సానుభూతికి, వాత్సల్యానికి అదే అంతిమ స్థాయి.

“ఏంచేద్దామక్కా?” అన్నాను.

నావంక సజలనయనాల్తో జాలిగా వీక్షించింది. “ఈ రాత్రి గండెల్లి కోయదు. కన్నిదంగా స్ప్రలపిస్తుంది. అంది” “డాక్టరు వడి గితే చాలా అపాయం అన్నాడు. అర్జంటుగా నూరురూపాయలు పెట్టి యిన్‌జక్షన్లు కొని యిస్తేనేగాని బ్రతకటం కష్టమని చెప్పాడు.”

ఓ నిట్టూర్పు వొచ్చింది నానుంచి. ఎంత అమాయకురాలు ఆమె! ఎంత తీపి, ఎంత భ్రాంతి యింకా ఆ పనికిరాని భర్త అంటే. ఏళ్ళతరబడి యిలా అంతులేనిచాకిరీ చేస్తూ, ఆ భర్తను కేవలం మంచంమీద కదిలి మెదిలేవరకైనా బ్రతికించుకోవటానికి తాపత్రయ పడుతోంది. బావకు యిటువంటి ప్రమాదం యిదివరకు అయిదు సార్లకుపైగా వచ్చింది. అన్నిసార్లు నా సహాయమే కోరింది. నేనే సాయం చేశాను.

ఒక ఆలోచన స్ఫురణకు వచ్చేసరికి వళ్ళు ఝల్లుమంది. ఓ అర గంటక్రితంవరకూ డబ్బుకోసం నేను ఎంత మథనపడ్డాను?

ఒకానొకరోజు నాన్నగారు ఆప్యాయంగా కొనిచ్చిన సైకిలు, నాకు రోజూ అవసరం అయే వస్తువు యీవేళ ఒకానొక పనికోసం అమ్మేశాను. దిగులుగానే వుంది అందుకు. “నాయనా! సైకిలు ఏదీ?” అని అడిగేవాళ్లు లేనంతమాత్రంచేత విచ్చలవిడిగా ప్రవర్తిస్తే నాలో హృదయం ఏదీ? జ్ఞాపకచిహ్నాలను అవసరాల కోసం అమ్మేసుకుంటే నాలో ప్రేమకు జాగా ఏదీ? కాని ఓ నిశ్చయం-కాదు ఓ నమ్మకం .నాలో రగిలిన బాధనూ, దుఃఖాన్నీ శాంతింపచేసింది. ఉంది. నాలో ప్రేమకు స్థానం వుంది. అందుకే యివాళ యీ పనిచేశాను.

అక్కయ్యకు యిదివరకు చాలాసార్లు సహాయం చేశాను. కాని ఆ పరిస్థితులు వేరూ, యీ పరిస్థితులు వేరూ. అటువంటి కొన్ని సమయాలలో నేను అనేకబాధలకులోనై ఆమెకు సహాయం చేసినా ఆ బాధలు నాతోనే నిలిచిపోయాయి. కాని యీసారి అలా జరగదు. ఈ బాధకూ, ఆ బాధకూ ఎంతో వ్యత్యాసం వుంది. అద్దెకున్న పంతులుగార్ని అద్దెకోసం అడిగినప్పుడు నాలో గిర్రున తిరిగిన వేదనా, నడిబజారులో పోలీసువాడు నన్నల్లరిపాలు చేసి, కీలుబొమ్మనుచేసి ఆడించిన దైన్యమూ, ఏళ్ళతరబడి కాపాడు కుంటూవచ్చిన ఆప్తమిత్రుడికన్నా ఎక్కువైన నా సైకిలుకు దూర మౌతున్న తరుణంలో చలించిన నాలో ప్రజ్వలించిన అగ్నిలాంటి ఆ వేదనా యీ క్షణంలో వాయువేగంతో మనోనేత్రంముందు మెదిలి, అంతర్థానమైనాయి. అనిపించింది నాకు :— ఇదంతా దేనికోసం? ఎవరికోసం? నేను ఉన్మత్తుణ్ణి కావటంలేదు కదా. అయితే అవనీ. యీ సమయంలో పరిస్థితులకు దాసోహం అంటాను. కాని మూర్తీభవించిన శోకంలా వున్న అక్కయ్య ప్రముఖమైనస్థానం హృదయక్షేత్రంలో ఏర్పరుచుకుంది. ఈ స్థానాన్ని కదిలించేశక్తి నాలో వుందా...ఉండాలి.

చివరకు ఈ మాటలు పెగిలాయి, నోటినుంచి "అక్కయ్యా! యిప్పుడు డబ్బెలావస్తుంది?"

"నాకు నువ్వుతప్ప యింకెవరున్నారు మధూ?"

మౌనంగా తల పంకించి ఊరుకున్నాను.

"లాభం లేదంటావా మధూ?"

బావకోసం ఎంతడబ్బు వెచ్చించినా వ్యర్థమేనని తెలుసు. శూన్యమైన యీ ప్రయోజనంకోసం చూస్తూ, చూస్తూ, ఇటువంటి విపత్కాలంలో ఎలా త్యాగం చేసేది.

అయినా "లేదు" "కాదు" అనటానికి మనసురాక "రేపటిలోగా ప్రయత్నిస్తాను" అని చెప్పాను.

అపస్వరాలతో ఆమె యిలా అంది: "నువ్వు తమ్ముడివే అయినా అంతకంటే ఎక్కువగా నిన్ను గౌరవిస్తాను. ఇదివరకు ఎన్నోసార్లు నన్ను ఆదుకున్నావు. జబ్బుతో అయినాసరే, బావ లేనిదే నా బ్రతుకు ఎంత దుస్సహంగా వుంటుందో నీకు తెలియక పోలేదు. నీవల్లతప్ప నాకు మరెవరివల్లా సహాయం లభించదు."

కొంచెం ఆగి ఓ నిట్టూర్పు విడిచి "నీస్థితి నాకూ తెలుసు. నిన్నెక్కువ బలవంతపెట్టేశక్తి నాకు లేదు. బావ వొంటరిగా వున్నాడు. తలుపులు తీసేవచ్చాను. అటో, ఇటో నీ చేతుల్లోనే వుంది. నిన్నింకా అంతకంటే ఎక్కువేం బ్రతిమిలాడను? వస్తా నమ్మా, సిగ్గులేని యీ అక్కయ్య అవస్థను మరిచిపోబోకు" అంటూ కళ్లు తుడుచుకుని, గబగబ బయటికి నడిచి, చీకట్లో కలిసిపోయింది.

నేను నిర్ఘాంతపోయి నిల్చున్నాను. ఆమెగారి చివరి మాటలు గుండెల్ని నిలువునా చీల్చాయి. ఎవడైనా ఘోరంగా ప్రవర్తిస్తే ప్రజలు వేలెత్తిచూపే వ్యక్తిలాంటి కఠినుడ్నా? నాలో యింత క్రూరత్వం ఎలావుంది? ఇటువంటిసందర్భాలలో మనసులో చెలరేగే బ్రహ్మాండమైన సంక్షోభాన్నే, పెనుతుపానులనీ, ద్వంద్వయుద్ధాలనీ అంటారు. కొంతమందిలా వీటిని అరికట్టేశక్తి నాకు లేనిమాట నిజమే.

ఆవేశంతో ముందుకు నడిచాను. ఇరుకైన యీ హృదయ వీథిలో పరిక్రాంతి ఆలోచన్లకు యిహ తావులేదు. అది అపూర్వమైన క్షణం. స్వాగతం పలుకబోయే అత్యద్భుతమైన మాలతి చిరునవ్వు, దానికోసం తాపత్రయపడే నా చిత్తభ్రాంతి యివన్నీ మటుమాయ మయ్యాయి. నాకు కావలసింది ఒకటే. నేను చేయబోయేది అదే. అక్కయ్య కోరికతీర్చటం. ఫలితం ఎలావున్నా సాయంచేశానన్న సంతృప్తి మిగిలితే చాలునన్నస్థితికి వచ్చాను. కదలబోయాను.

అదేనిముషంలో చెప్పులులేని కాళ్ళతో చలపతిరావు లోపలికి వచ్చాడు. అతనిముఖం వెలా తెలా పోతోంది. భీతో, అసమర్థతో, ఆర్తితో వెంటాడితే మానవుడు అలా వుంటాడు.

చప్పున ఆగి "కూర్చో" అన్నాను.

చలపతిరావు కూర్చోలేదు. వగరుస్తున్నాడు. ఆ స్థితిలో అతన్ని చూస్తే జాలివేస్తోంది నాకు. అంత దిగులు దేనికి అతని కళ్లలో?

"అలా వున్నావేం?"

అతనో చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. చేతిరుమాలు తీసి ముఖం మెత్తగా తుడుచుకున్నాడు. పాముని చూసి మనిషి బెదిరినా అలావుండడు. భగవంతుడి ఆకారం తొంగి తించినా మనిషి అలావుండడు.

ప్రేమగా అతని భుజంమీద చేయివేసి లాలనగా "ఏంటీ కంత యిది? నా ముందు భయందేనికి? ఏం జరిగిందో చెప్పు" అన్నాను.

చలపతిరావు నా ముఖంవంక చూడటానికి ప్రయత్నించి మళ్ళీ తత్తరపాటుతో తలదించుకున్నాడు.

నేను యింకా ఏదో చెప్పబోతున్నాను.

అతను ఆటబొమ్మలా పెదవులు కదిపాడు. కష్టంమీద అర్థం చేసుకుంటే ఆ మాటలతీరు యిలావుంది.

"నాకో సహాయం కావాలి."

సహాయం కావలసివస్తేనే చలపతిరావు నా దగ్గరకువచ్చే స్నేహం కాదు మా యిద్దరిదీ. అందుచేతనే ఆమాటలువిని జంకాను. ఆపదలో వున్నవాడికి సహాయం చేయగలిగే సామర్థ్యం నాలో ఎంతనివుంది?

ఏమిటో చెప్పమన్నాను.

ముందుగా యిలా ఉపోద్ఘాతం చెప్పాడు. "సేవలు నీదగ్గరకు వచ్చేవాడినికాదు. ఎంతమందిచుట్టూనో తిరిగాను. ప్రయోజనం లేకపోయింది. ఇహ నిన్ను కష్టపెట్టటం తప్పనిసరి అయింది. నామాటకు నీవిచ్చేవిలువ తెలుసు కనుకనే ధైర్యంచేయగలిగాను."

అర్థమవుతోందినాకు. ఆమాటల్లోని అంతరార్థం గ్రహించగలిగే సామాన్య తెలివితేటల్ని భగవంతుడు నాకు ప్రసాదించాడు.

"ఓ వందరూపాయలు కావాలి."

నేను శిలావిగ్రహంలా నిల్చున్నాను.

"అర్జంటుగా ఓ వందరూపాయలు కావాలి."

కదల్లేదు; మెదల్లేదు నాశరీరం.

"పోనీ డెబ్బయి ఎనభై మన్నానున్నా......"

ఇవాళ చాలా విచిత్రమైనరోజు అంతేకాదు. చెడ్డరోజు. దుర్భరమైన యీ అవస్థను భరించడం అసాధ్యమే.

"మాలతీ!"

"అక్కయ్యా!"

"చలపతిరావూ!"

సాధారణంగా జరిగేదే అది. మొదట జరిగిన సంఘటనకన్నా తర్వాతదానికి బలం ఎక్కువగావుంటుంది. మొదటినుంచీ విషాదపూరితమైన సంఘటనలు గడిచినా, చివరకు ఓ సంతోషప్రదమైన సంఘటనతో ముగిస్తే దాన్ని కామెడీ అనే అంటారు. లేదా ఆదినుంచీ నవ్వులతోగడిచినా అంతంలో ఓ చిన్న వేళంవచ్చి ఛిన్నాభిన్నం చేసిందంటే అది ట్రాజెడీ. ఈ సిద్ధాంతానికి నేను లొంగిపోయాను.

మాలతికి నాకూ వున్న అనుబంధానికీ, అక్కయ్యకూ, నాకూ వున్న సాంగత్యానికీ, చలపతిరావుకూ నాకూ వున్న స్నేహానికీ యిది కొలబద్ద అని అనలేను. నిగ్రహశక్తి నశించిపోతూన్న యీ అంతర్దశలో, ఏ విలువకు ప్రాధాన్యత యివ్వాలో తెలియక వివశుడినై జ్ఞానంకూడా నశించిపోతున్న యీ క్షణాలలో, నాకున్న ఓపిక, ముక్కలై యిది విపరీతమైన ఆలోచన్ల తాకిడికి తట్టుకోలేక జారించి పోతూన్న సమయంలో చలపతిరావు వచ్చి సాధించబోతున్నాడు. ఇది నా తప్పు కాదు.

అప్పటికే హీనస్వరంతో "అంత అవసరమా!" అని అన్నాను.

దీనంగా నా చేతులు పట్టుకున్నాడు. ఎంతో ప్రాధేయ పడ్డాడు. "ఎంత అవసరమో వివరించి చెప్పగలిగే శక్తి నాకు లేదు" అన్నాడు చివరకు.

ఇంక నాలో ఆలస్యానికి తావు ఏదీ? చెప్పరాని వేగంతో జేబులోంచి రూపాయల నోట్లు బయటకుతీశాను. కన్నీళ్ళకారటం లేదు గాని కంఠం పూడుకుపోయింది. గద్గదికంగా "ఇదిగో, నా దగ్గర యివే వున్నాయి. తీసుకువెళ్ళి అవసరాన్ని గడుపుకో" అని వాటిని యిచ్చేశాను.

చలపతిరావు కళ్లలో ఓ క్షణంపాటు గనుస్నాయి. తరువాత మెరిశాయి. ఆనందోద్రేకంతో యించుమించు కావలించుకున్నంత పని చేశాడు, "ఎంత ఉదారహృదయం నీది?" అని అభినందించాడు. అంతకంటే ఎక్కువ నాకు వినబడలేదు. అతను యెప్పుడు వెళ్ళిపోయాడో కూడా నా కంతగా గుర్తులేదు.

ఓ పావుగంట నిశ్శబ్దంగా. ఆలోచనారహితంగా గడిచింది. అప్పుడు బుద్ధిపుట్టి బయటకు వచ్చాను. వీధి నిర్మానుష్యంగా వుంది. గగనంలో చుక్కల్లా చీకటిలో దీపాలతో రాత్రి అందంగా వుంది. పంతులుగారి భాగంలో చడీచప్పుడూ లేదు. ఒంటరితనం భయాన్నే కాకుండా బాధనూ కలిగిస్తోంది. కాని వాటిని తీర్చగలిగే హృదయాలు యీ సమయంలో లభించటం కల్ల.

"ఇదేమిటి? ఏడుస్తున్నావు?"

అనాలోచితంగా చెయ్యి తగిలేసరికి తడిస్పర్శతో నాకే స్ఫురించింది. అమ్మాయిలాగా యీ అబ్బాయి ఏడుస్తున్నాడు. జీవితంమీద విరక్తి, మనుషులమీద అసహ్యమూ రగిలింది. అమ్మ లేదు. నాన్న లేదు. నేనే ఓదార్చవలసిన అక్కయ్య వుంది. కోరికలు పెంచుకోరాదు. సమర్థత లేదు. ఎవరన్నా తన్ను తలుచుకుని "అయ్యో పాపం" అని నిట్టూరిస్తే బాగుండును.

కొంచంసేపు కన్నీటిని అలానే కారనిచ్చాను.

రేపు కొంతమందికి ఎలా ముఖం చూపించాలో తెలియడం లేదు. ఎగ్జిబిషన్‌లో చూసిన విచిత్రంలా యిద్దరుముగ్గురు వ్యక్తులు కళ్ళముందుకు వచ్చి, పోయి వస్తున్నారు. భూమి గుండ్రంగానే తిరుగుతోంది. సూర్యుడు తెల్లవారుఝామునే ఉదయించి, సాయంత్రానికి వెళ్ళిపోతున్నాడు. చంద్రుడు పాపం! అప్పుడప్పుడూ సూర్యుడు వెళ్ళిపోకముందే వస్తున్నాడు. నా ముందు వ్యక్తులు వచ్చి, నవ్వి, ఏడిచి వెళ్లిపోతున్నారు. కోరికలు పెరిగి, విరిగి, తరిగిపోతున్నాయి. [illegible] ఆగిపోయింది.

మనసులో వృత్తంలా ఉంగరం తిరిగింది.

చిన్నారి ఉంగరం. ముద్దుగా, ముచ్చటగా వున్న ఉంగరం. ప్రేయసి చిటికెనవేలుకు తొడిగితే ప్రియుడిలాంటి పిచ్చివాడికి, అమాయకమైన ఆనందాన్నిచ్చే ఉంగరం.

కొనకుండానే బంగారు ఉంగరం విరిగి ముక్కలై పోయింది. రాయి నుసి అయిపోయింది.

ముక్క కాగితంగా మారి, కాగితాలు బంగారంగా మారక ముందే పెనుగాలికి కాగితాలు ఎగిరిపోయాయి.

చలిగాలిబాధ అప్పటికి తెలిసి, లోపలకువచ్చి, రగ్గు కప్పుకుని పడుకునేసరికి ఉక్కబోయటం ప్రారంభించింది. రగ్గుతీసేసి చూశాను. ఎముకలుకొరికే చలి. ఎల్లా భరించను యీ అవస్థ?

"మాలతీ! మాలతీ! మాలతీ!

"అక్కయ్యా! అక్కయ్యా! అక్కయ్యా!"

"చలపతిరావూ! చలపతిరావూ! చలపతిరావూ!"

తెల్లవారింది తీరని కోరికలతో. అద్దంలో ముఖం చూసుకుంటే కళ్లు ఎర్రగా వున్నాయి. మత్తుగావున్న ముఖం అందంగా వుంది నాకు. తలుపులుతీసి నిల్చున్నాను. పంతులుగారు—పాపం చప్పున నన్ను చూసేసరికి, సిగ్గుతో ముఖం త్రిప్పుకోబోయి, లాభం లేక "ఏమండీ, కళ్ళు ఎర్రగా వున్నాయేం?" అని అడిగారు.

"రాత్రి నిద్ర పట్టలేదండీ" అని నిజం చెప్పేశాను.

ఆయన ఆశ్చర్యంతో "అదేం? వంట్లో బాగులేదా?" అని అడిగాడు వెంటనే.

"బాగానే వున్నట్లుంది. ఎందుచేత నిద్రపట్టలేదో?"

కొంచంసేపు వుండి ఆయన లోపలకు వెళ్ళిపోయాడు. తర్వాత నేనూ, ముఖం కడుక్కుని కాఫీకి వెళ్ళిపోయాను.

అసలు యివాళ పార్టీకి వెళ్ళకూడదనుకున్నాను. ఎవరికీ కనిపించకుండా తిరుగుదామనుకున్నాను. కాని ఎక్కువసేపు గడిచి పోకముందే ఆ పని చేయలేనని తెలిసింది. సుందరవదనారవిందం ఒకటి హృదయద్వారంనుంచి తొంగిచూస్తూ కవ్విస్తోంది. ఆ క్షణంలో ఆలోచనలు మధురంగా వున్నాయి. కాని ఆ తీపి ఎక్కువసేపు అనుభవించటానికి నేను నోచుకోలేదు.

ఆ మధ్యాహ్నం, అరగంటనుంచీ కథలపుస్తకం ఒకటి పట్టుకుని ఒక్కవాక్యం అయినా బోధపడనిస్థితిలో, నా గదిలో, కుర్చీలో కూర్చున్నప్పుడు నా చేతిగడియారంలో తొమ్మిదిన్నరయింది.

"పాపా!" అని పిలిచాను.

రెండోసారి పిలిచాక పాప వచ్చి ప్రశ్నార్థకంగా చూస్తూ నిల్చుంది.

"టైమెంతయిందో చెబుతావూ?"

మాట్లాడకుండా వెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగివచ్చి "రెండున్నర" అని చెప్పింది.

"సరే వెళ్ళు"

అప్పటిదాకా వెళ్ళిపోవడమే ఉత్తమం? నావంతో విశ్రాంతిగా కూర్చున్నాను. ఇంకో అరగంటలో ఇక్కడికే నాకూ ఉన్న యోచన మెరుపులా తట్టింది.

వెళ్ళనా? వద్దా?

హఠాత్తుగా అమాయకమైన ఓ స్త్రీ విశాలనయనాలు నర్తించి జలబిందువులలో నాలో తచ్చిపోయాయి.

ఒక్క ఉదుటున లేచినిల్చుని అద్దంలోకి చూశాను. వత్తుగా వున్న ముఖం అందవిహీనంగా కనపడింది. గడ్డం పెరిగిపోయింది. ఇప్పుడు లోపలికిపోయి చాలా కొద్దివ్యవధిలో తయారైపోయాను.

ఆలస్యంగా వెళ్ళింది నేనే. అప్పటికే అతిథులందరూ వచ్చేశారు. ఎక్కువభాగం ఆడవాళ్ళు. అసలు యీ మొగవాళ్ళందర్నీ ఆహ్వానించకుండావుంటే ఒకపెద్ద తెలివి తప్పేదికదా అనుకున్నాను.

పద్దెనిమిది నిండి పంధొమ్మిది వస్తోందిట మాలతికి. వచ్చిన స్త్రీలలో యిద్దరు ముగ్గురు మినహా ఎక్కువమంది తెలిసినవాళ్ళు లేరు. వాళ్ళయినా యిదివరకు నాతో చదువుకున్నవాళ్ళు. విష్ చేశారు నన్ను చూసి. నా ముఖంలో మాలిన్యం ఎవరైనా పసిగట్టేస్తారేమోనని భయంగా వుంది. ఉన్న కొద్దిమంది మొగఅతిథులలో ఎక్కువభాగం పరిచయంవున్నవాళ్ళే. కాని......నన్ను చూసి తలవూపి, తలవంచుకుంటూన్న చలపతిరావును చూసి చకితుడ్నయాను. నాముఖంలోలాగానే అతనిలోకూడా మాలిన్యం చాలావుంది. నిన్నరాత్రి అంత విపత్తులో వుండి యీ రోజు పార్టీకి ఎలా వచ్చాడా అని ఆశ్చర్యం వేసింది. కాని అతనిలానే నిన్న నేను లేనా? ఇవాళ రాలేదా?

ఈ ఊరడింపుతో అతనిదగ్గరకుపోయి పలకరించాను. పైగా అతనిప్రక్కనే కూర్చున్నాను.

ఇంతలో మాలతి లోపలినుంచి వచ్చింది. ఒకసారి గబగబ అందరివంకా పరకాయించి చూసిన ఆమె వదనం నన్ను చూడగానే ప్రఫుల్లమైనట్లు గమనించాను.

నవ్వాను.

మాలతి నా దగ్గరకువచ్చింది. చలపతిరావు ఎందుకో కంగారు పడుతున్నాడు. ఆమె మందహాసంచేసి "ఇంత ఆలస్యమైతే ఎలా? రావేమోనని భయపడుతున్నాను. అంది.

"రాలేనని నేనూ భయపడ్డానుకే?"

మాలతి విచారంగా నవ్వింది. "నువ్వెప్పుడూ యింతే. అందుకనే ప్రొద్దున్న మీయింటికి వచ్చాను. లేవు నువ్వు" అంది.

"ఎందుకంత శ్రమ నీకు? నేను రాకపోతే పార్టీ ఆగిపోదు కదా."

ఆమె ఏదో చెప్పబోయి "పో! నువ్వెప్పుడూ యింతే" అని మౌనంగా అక్కడినుంచి స్త్రీలదగ్గరకు వెళ్ళిపోయింది.

చలపతిరావు నాతో మెల్లగా "నేనుకూడా నువ్వు రావనే అనుకున్నాను" అన్నాడు.

అతనివంక విచిత్రంగా చూసి "క్షేమమేనా?" అన్నాను.

"క్షేమంగానే వున్నా" నాడు.

"కాని ఆసారికి యీసారికి చాలా భేదం వుంది."

ఆడవాళ్ళంతా ఏదో కబుర్లలో నిమగ్నమైవున్నారు. వాళ్ళ మధ్య కూర్చుని మాలతి నావంక చూస్తోంది. చలపతిరావు ఆమెవంక తదేకదీక్షగా చూస్తున్నాడు. మాలతి తండ్రి మరొకవ్యక్తితో కులాసాగా ఏవో కబుర్లు చెబుతున్నాడు. నాప్రక్కన ఓ సీటు ఖాళీగావుంది. ఆయన నాదగ్గరకొచ్చి మాట్లాడాలని వచ్చినట్టు వచ్చి కూర్చున్నాడు.

నా భుజంమీద చేయివేసి "ఏమిటి కులాసానా?" అన్నాడు.

తల వూపాను.

కొంచెంసేపు ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకున్నాం.

తర్వాత పార్టీ ప్రారంభమైంది.

మాలతి తండ్రి హఠాత్తుగా యిలా అన్నాడు "ఈ ఏడు మా అమ్మాయి పెళ్ళి చేద్దామనుకుంటున్నాను."

నాకు ఆదుర్దా హెచ్చింది. "వరుడు దొరికాడా?" అని అడిగాను.

"నా దృష్టిలో ఒకడు వున్నాడు. ధనవంతుడు. మొన్ననే ఎస్. ఓ. బి. ఎస్. పాసై ప్రాక్టీసు పెట్టాడు."

"మంచిదే" అన్నాను.

"అమ్మాయి నింకా అడగలేదు. కాని దానిహృదయం నాకు తెలుసు. దానికి చాలామంది స్నేహితులున్నమాట నిజమే. నా మనస్తత్వం దానికి తెలుసనే నా విశ్వాసం. చాలామందిలా అది పొరబడదు. మరీ కొంతమంది వ్యక్తులతో అమితంగా స్నేహం చేసినా, అది స్నేహంకంటే మరో అడుగు ముందుకు వేయలేదనే నా నమ్మకం."

కాని యిదేమిటి? ఆ మాట అంటూ ఎందుకు నాకేసి ఓ వింత చూపు ప్రసరించాడు?

మాలతి యింకా నావంక చూస్తూనేవుంది. శోభన్నా ఎక్కువగా జాలివేస్తోంది నాకు. అవి బహుమతులు కాబోలు. ఓ ప్రక్క ఖరీదైన పుస్తకాలు వస్తువులూ చాలా పడివున్నాయి. బహుశా నేనే చేతులు ఝాడించుకుంటూ వచ్చింది. పౌరుషవంతుడికైతే అంతకన్నా అవమానం వుండబోదు. మనసులో ఉంగరం తిరుగుతోంది.

మొగఅతిథులలో మాటకారివాళ్ళు ఎవరూ వున్నట్లు లేదు. వాళ్ళలో వాళ్ళు ఏదో గొణుక్కుంటున్నారంతే. వాతావరణం ఎక్కువ సరదాగా లేదు. నేను యింతకంటే ఎక్కువ సంతోషంగా యిక్కడ వుంటుందని ఆశించాను.

హాసాలతో, మాటలతో, నవ్వులతో, ఆవేదనలతో ఓ అరగంట గడిచిపోయింది. నాకు కొంతసేపు చలపతిరావుతో మాట్లాడాలని వుంది. నిన్న అతన్ని చుట్టుముట్టిన ఆపద తీరిందో లేదో, లేచి మాలతిదగ్గరకు వెళ్ళాను. అప్పటికి టీ తీసుకోవటం కూడా పూర్తి అయిపోయింది. కిల్లీలు నమిలాక స్త్రీల పెదవులు మరీ అందంగా వున్నాయి.

"ఇదివరకెన్నా యిదే బాగుంది" అన్నా ఒకమ్మాయితో.

ప్రక్కనే కూర్చున్న ఒయుజతి ముఖంకూడా వెంటనే ఎర్రబారింది మాలతి చెవిపక్క. మాలతి పాపం ఏదో అవస్థపడుతోంది. వాలిక కొరుక్కుంటూ, ఊరుకోమని సౌంజ్ఞచేస్తోంది. నా మాటలు విన్న ఒకరిద్దరు అమ్మాయిలు చేతిరుమాళ్లు నోట్లకడ్డంపెట్టుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. నాకేం తెలుసును అప్పటిదాకా, ఎర్రబడిన యువతి అధరాలకూ లిప్‌స్టిక్ రంగుకూ ఎన్నాళ్ళనుంచో స్నేహం వుందని.

నేను ఆశ్చర్యపడక, చింతించక మాలతితో "ఓసారి యిలా వస్తావా?"

ఆమె వొచ్చింది. "ఇవాళ నిన్ను ఏమని ఆశీర్వదించమంటావ్?" అని ప్రశ్నించాను.

ఆమె సిగ్గుపడింది "నువ్వే చెప్పు."

నేను కొంచెం ఆలోచించి "వచ్చే ఏడు నీ జన్మదినానికి ఆయనగారి తరఫు బంధువులూ, స్నేహితులూ కూడా రావాలి" అన్నాను.

మాలతి శిరస్సు పైకెత్తి అర్ధనిమీలితనేత్రాలతో, బాధగా, విషాదంగా చూసింది. "సారీ. నీకు నేను థ్యాంక్సు చెప్పలేను" అన్నది.

"నా ఆశీర్వాదానికి నీవు కృతజ్ఞత అర్పించలేవన్నమాట అయితే." ఆమె తల ఊపలేదు. మాట్లాడలేదు.

"మరి నా బహుమతీ అందుకోవా?"

"నాకేం వొద్దులే" అంది.

"అంత కోపమా?"

"నీమీద నాకు యిదివరకు ఎన్నిసార్లు కోపం వచ్చిందేం?"

కొన్ని సెకన్లు మౌనంగా గడిచాయి.

"మాలతీ నేనూ ఓ వస్తువు ప్రెజెంటు చేద్దా మనుకున్నాను మొదట."

నేత్రాలు చూశాయి.

"కాని మనస్సేహానికి విలువ కట్టలేకపోయాను."

ఆ నిముషంలో విశాలమైన ఆమె నయనాల్లో అవతరించిన మెరుపును నాబుద్ధి పసికట్టింది.

మాలతి విచిత్రమైనగొంతుకతో "నీకట్లా థ్యాంక్సు చెప్పను" అంది.

"ఆమాట చాలు నాకు."

ఆకస్మికంగా నాచూపు ఆమె చిటికెనవేలుకు తొడిగిన చిన్నారి అంగుళీయంపైన బడింది. కిటికీనుంచి దూసుకువచ్చిన మధ్యాహ్నపు యెండకు నీలపురాయి ధగధగ మెరిసింది.

నా మనసులో సుదర్శనంలా ఉంగరం గిరగిర తిరిగింది.

నాలో మెరిసినా, విన్నా అలుముకున్న, అల్లుకున్న ఊహాచిత్రానికి సరియైన రూపం యిదే. నాదగ్గరనుంచి డబ్బుపోకుండా వుంటే యిటువంటిదా న్నే మాలతికి ప్రెజెంటు చేసేవాడ్ని.

"మాలతీ! ఇది నీకు ఎవరు యిచ్చారు?"

"చలపతిరావు."

ఒక్కసారిగా హృదయం విచ్ఛిన్నమైంది. వెనుదిరిగి అతనివంక చూశాను. మా యిద్దరిమధ్యా అతన్ని గురించే సంభాషణ జరుగుతుందని ఊహించాడు కాబోలు. తైలంలేని దీపంలా వెలవెలా పోతోంది అతనిముఖం.

మధుర మందహాసంతో ఆమె అడిగింది నన్ను: "బాగుందా?"

"చెప్పలేనంత బాగుంది."

కాని నా పరిస్థితి హృదయవిదారకంగా వుంది. సామాన్యమానవుణ్ణి. నా హృదయం విశాలమైందిగానీ, ఉన్నతమైందిగానీ కాదని అప్పుడు తెలిసింది. అవకాశంవుంటే చలపతిరావును నమిలి మ్రింగివేయాలన్నంత కోపం వస్తోంది. నేను శాంతమూర్తినని ఎవరయినా భావిస్తే అది వాళ్ళ పొరపాటు.

దిగులు ఏడుపుగా మారుతోంది.

నీచుడు చలపతిరావు. ద్రోహి చలపతిరావు. ఏ కార్యం కోసం నేనాడబ్బును అష్టకష్టాలుపడి సాధించానో, అదే అవసరం కోసం మాయమాటలు చెప్పి నన్ను నిలువునా మోసగించాడు. ఈ ద్రోహివల్ల అమాయకమైన ఓవ్యక్తికి సహాయంచేసే, ఓత్యాగాన్ని నాకు నేను నిరూపించుకోకుండా భంగపడ్డాను. మాలతి ఉంగరంకన్నా, నావ జబ్బుకన్నా వెయ్యిరెట్లు అధికంగా చలపతిరావు అపాయాన్ని ఊహించాను. దీనివల్ల నాకెంతకష్టం కలుగుతుందో గ్రహించలేడా ఆమూర్ఖుడు? తెలిసే ఈ అకార్యానికి పూనుకున్నాడు. ఇద్దరం రెండుదార్లు త్రొక్కాం. గమ్యస్థానం ఒకటే. ఆమాటల్లో బెదురు, ఆకళ్ళలో అదురు యిప్పటికి నాకు గ్రాహ్యమైంది. కాని యింతసాహసం ఎలావచ్చింది అతనికి? ఆ నిముషంలో నాబుద్ధి చురుకుగా పనిచేసింది. అంతవరకూ అస్పష్టంగావున్న అతన్ని హృదయాన్ని అప్పుడు చదవగలిగాను. స్వార్థం సాహసానికి దారితీసింది. అంతేకాక పొట్టిచేతుల్తో నేనిక్కడికి రాలేనని భ్రమపడ్డాడు.

"ఇదేమిటి?" అని మాలతికంఠం ఆశ్చర్యంగా వినిపించింది. "అంత వెంటనే నీకళ్ళు ఎర్రబడ్డాయేం?"

మాయిద్దరిమధ్యా వున్న చనువు, అక్కడున్న చాలామందికి తెలిసివుండడంచేత మా ప్రవర్తన విడ్డూరంగా కనిపించలేదను కుంటాను. ఒక్క చలపతిరావుతప్ప మిగిలినవాళ్ళంతా ఎవరిధోరణిలో వాళ్ళు వున్నారు.

"బహుశా నాకళ్లు ఎర్రబడటాన్ని నువ్వు చూడటం యిదే ప్రథమం అనుకుంటాను."

"మధూ!"

"ఏమంత ఆశ్చర్యం?"

ఆమె జవాబు చెప్పలేదు. సందిగ్ధంగా చూస్తుంది. నేను వాంఛించిందికూడా అదే.

"నాకు యింక సెలవు యిప్పిస్తావా?" అన్నాను.

కష్టంగా తల ఊపింది.

చలపతిరావువంక క్రూరంగా ఓ చూపుచూసి బయటకు వచ్చాను. ఇంతకు ముందువరకూ ఒక్కటే వేదన. ఇప్పుడు క్రోధం కూడా-అబ్బ! ఈమనుషులు ఎంత దుర్మార్గులు! నా యీ అనుభూతులకు కారణం ఏమిటో.

ఇంట్లో ఒంటరిగా కూర్చున్నాను. మాటిమాటికీ అక్కయ్య గుర్తువస్తోంది. నిన్న రాత్రినుంచీ ఆమె జాడే తెలియదు. పాపకు ఎలా వుందో! వాళ్లయింటికిపోయి చూసివద్దా మనిపించింది. కాని... అక్కడ నాఅవస్థ మరీదుర్భరంగా వుంటుంది. అందులోనూ రిక్తహస్తాలతో వెళ్ళటం.

వెళ్ళగానే అక్కయ్య యిలా అనుగుతుంది." డబ్బు దొరికిందా మధూ?"

జవాబుగా తలవొంచాలి.

అక్కడినుంచి ఏడుపు, గందరగోళం.

చలపతిరావును డబ్బుతియ్యాలి. అతను ప్రతీకారం అనుభవించాలి. బహుశా యివి చాలా హేయమైన, ఘోరమైన కార్యాలు. అయినా నేను వాటికి లోబడ్డాను.

నామీద నాకే అసహ్యంకలిగేటట్లు, నా అంతరంగాన్ని ఎవరైనా చదవగలిగితే వాళ్ళకు నామీద రోతకలిగేట్లు కొంచం సేపు నా ఆలోచనలు వికృతంగా సాగాయి.

కాని అలా ఎక్కువకాలం సాగిపోకముందే ఎవరో అజ్ఞాన వ్యక్తి వీపుమీద చరిచినట్లయింది. ఉలుక్కుపడ్డాను.

ఎందుకు నాకింత సంచలనం? ఏంజరిగింది? చలపతిరావు నన్ను మోసంచేసినమాట నిజమే. కాని అతను నాకేమి అపకారం చేయగలిగాడు? ఏమి సాధించగలిగాడు?

ఈ చివరియోచన ఊరట కలిగించింది. హఠాత్తుగా కలిగిన యీ ఊహతో నన్ను గర్వం ఆవహించింది. ఎంత ప్రయత్నించినా, ఎంత తంటాలుపడినా నిర్మలహృదయంలో చలపతిరావుకు చోటులేదు. కేవలం ప్రయాస. భ్రాంతి, చివరి కతనికి విచారమే, మనస్తాపమే మిగిలేది.

ఈ గర్వంతో నాకు బాగా ఉత్సాహం వచ్చింది. చలపతిరావును క్షమించగలిగేస్థితిలో వున్నాను.

వీధితలుపు చప్పుడైంది. లేచివెళ్ళి తలుపుతీశాను. అభిముఖంగా చలపతిరావే నిలబడివున్నాడు. నాకు జాలి, కోపం రెండూ వేయలేదు.

"లోపలకు రా" అన్నాను.

మానవుడు! నిర్జీవంగా కూర్చున్నాడు లోపలకువచ్చి.

"అలావున్నావేం? మళ్ళీ ఏదైనా విపత్తులో యిరుక్కున్నావా?" అన్నాను.

క్షమించమని అడగటానికే వచ్చాను. ఆమె నన్ను పార్టీకి యిన్వైట్ చేసినప్పటినుంచీ నాలో ఏదో చెప్పలేని ఆకర్షణ. మంచిది, చిరకాలం జ్ఞాపకంవుండేటట్లుగా ఏదైనా ప్రెజంట్ చేసి నా అధిక్యత నిరూపించుకుందా మనుకున్నాను. మూడురోజుల్నుంచీ చెప్పరాని వేదనకు గురిఅయాను. డబ్బు ఎక్కడన్నా [illegible] ఎంతయినా ప్రయత్నించాను. లభించలేదు. చివరకు నువ్వే కనికరించావు. నీ స్థితి నాకు తెలుసు. ఏదో అవసరం వున్నట్టు నటిస్తే, ఎక్కడినుంచైనా కష్టపడి సంపాదించి సహాయపడతావని అలా నాటకమాడాను."

"మంచిపని చేశావు. నీఅవసరంకోసం ఆ కలత లేని యిబ్బందిపెట్టటం నీ అభీష్టమా ఏమిటి? నేను నీకు డబ్బు యిచ్చే రూపాయలు చేతుల్లో పోసినప్పుడు ఎక్కడివన్నా అడగలేదే. కావలించుకుంటే కరిపోయిందనుకున్నావా? నీలాంటి జీవితమే నాది. ఎటువంటిపరిస్థితిలో నీకు సాయంచేయగలనో ఆలోచించావా?"

చలపతిరావు వ్యథాపూరితంగా ప్రశ్నార్థకంగా చూశాడు.

ఉద్వేగం అణుచుకుంటూ "మహాత్తరమైనదని నేను దృఢంగా నమ్మిన ఒకానొక కార్యంకోసం ఏళ్ళ తరబడి వాడిన నా సైకిలును అమ్మాను. ఆ రూపాయలు అలావచ్చినవే. ప్రాణాపాయస్థితిలోవున్న అత్యంత దగ్గరబంధువును కాపాడటానికికూడా ఆ డబ్బుని వినియోగించటానికి నేను తెగించలేకపోయాను. నువ్వు నన్ను విపరీతపరిస్థితుల్లోకి లాక్కువెళ్ళావు. స్నేహానికి, మిత్రప్రేమకూ దాసోహం చేశాను. మూర్ఖుడా! నీకు విశ్వాసంలేదు. అంతేకాదు. ఎలా వినియోగపర్చటానికి ఆ డబ్బు సేకరించేందుకు తాపత్రయపడ్డానో నీకు తెలియదు.

"ఏం...ఎందుకు?"

"అది నువ్వు తెలుసుకోకపోతేనే మంచిది. నువ్వు అప్పుడప్పుడూ ఆకర్షణలకు లోనై విపరీతంగా ప్రవర్తించినా విలన్‌లాంటి వాడివి కాదని నాకు తెలుసు. ఆకారణం తెలుసుకోవాలని ఎందుకు ఉత్సాహపడతావ్? పశ్చాత్తాపం, పరితాపం చెందటానికి సరిపోయిన మానవత్వం నీలో వుంది. ఆమాత్రం చాలు. ఆ కారణం గనుక నేను బయటపెడితే నీవు ఈరాత్రి అంతా నిద్రపట్టక కుమిలికుమిలిపోతావు. అందుచేతే అది బయటపెట్టటం నాకిష్టంలేదు."

కొంచం ఆగి విషాదపూరితంగా చలపతిరావు ఇలా అన్నాడు: "నన్ను క్షమించు. నిన్ను నేను అర్థంచేసుకోలేకపోయాను."

"అదే మంచిపని. అర్థంచేసుకుంటే నీ వేదనకు పరిహద్దు లుండేవి కావు."

నిశ్శబ్దం గంభీరంగా వుంది. అలా అయిదు నిమిషాలు గడిచాయి. నాకు అంతకంటే ఎక్కువ సంభాషణ జరపటం ఇష్టం లేదు. అతనికి మాట్లాడేందుకు సాహసంలేదు. ఆసన్నివేశం దుస్సహంగా తోచిందికాబోలు, ఏమీ మాట్లాడకుండానే మౌనముగా బయటకు వెళ్లిపోయాడు.

క్షణమాత్రం నాకళ్లు విజయగర్వంతో ప్రకాశించాయి. నా పాత్ర చాలా నేర్పుగా నిర్వహించాను. అజ్ఞానంలో పడి కొట్టుకుపోతూన్న ఓ యువకుడ్ని, అతడి అవివేకం అతడికి తెలియపర్చకుండానే బుద్ధిచెప్పాను.

ఈ సంఘటనతో నాలో కలిగిన సంతోషం చాలావరకూ తగ్గిపోయింది.

సాయంత్రం ఆరుగంటలకు ఒకరోజు వచ్చాను. తలుపు తీసి వుంది. గది చీకటిగా అయిపోయింది. ఏ నిశ్శబ్దంతో అడుగులు వేస్తూ వచ్చాను.

కేవ మాలతి యింకా లేచిరాలేదు. అంతా నిశ్శబ్దంగా వుంది. ఆమె తలక్రింద కౌచులో పడుకుని వున్నట్లున్నాను. ముసిముసిగా వచ్చాను. సాయంత్రాలు పడుకోవటం ఆమె అలవాటు పోలేదని నాకు తెలుసు. గదిలో లైటు వెలుగుతోంది. దీపాలు ఎర్రగా వెలిగి వున్నాయి. కళ్ళు తెరుచుకున్నాయి.

"ఎవరూ?"

ఆ ప్రశ్న పూర్తి కాకుండానే నన్ను చూసి "నీవా!" అంది. నవ్వి కుర్చీలో కూర్చున్నాను.

ఇవాళ పుట్టినరోజు కదా, ఫ్రెండ్స్‌తో ఏ సినిమాకో వెళ్ళ యిలా ఒంటరిగా వున్నావేం?" అన్నాను నేనే.

"ఇవాళ జన్మలో పుట్టినరోజు పండుగలు చేసుకు నేందుకు తీరికెట్టను" అంది.

"ఎందుకో!"

"ఏదేమో. కారణం తెలియదు. ఇంత గంద్రగోళంతో నిండిన సరదాలు నాకు నచ్చటంలేదు. స్థిమితంగా వుండేవే బాగుంది అనిపిస్తోంది!

"పుస్తకాలు అతిగా చదువుతూంటే నీకు యిటువంటి బుద్ధులు పుడుతున్నట్లున్నాయి".

"ఏమో, నాకు తెలియదు".

కొద్దిసేపు ఎవరూ మాట్లాడకుండా కూర్చున్నాక "మాలతీ! నువ్వు ఎంత మంచిదానవ్?" అన్నాను.

"మహా నువ్వు మంచివాడివి కానట్లు!"

"నాలో ఏమిమంచి వుంది? నేను ఎవరికీ సంతోషం కలిగించలేకుండా వున్నాను. పైపెచ్చు నన్ను ప్రేమించినవారికి దుఃఖాన్ని యిస్తున్నాను."

"నువ్వు యీ మాటలు ఎవరిని ఉద్దేశించి అంటున్నావో తెలుసుకోవచ్చా?"

"నేను నీతో మాట్లాడుతున్నాను."

తెలిదనక్కరలేని అన్న యీ మాటలు ఆమెకు అంత ఆంతో శన కలిగిస్తాయనుకోలేదు. ముఖం ముడుచుకుంది.

"మాలతీ కోపమా?"

"నాకు కోపమని అంటే అతనాశ్చర్య యింతలో కోపంవచ్చుం పని ఆక్షేపిస్తావుగా."

నేను వెంటనే నవ్వేస్తూ "నువ్వు మంచిదాని వేకాదు తెలివైన దానివికూడా".

"మహా నువ్వుమాత్రం తెలివైనవాడివి కానట్లు?"

"అలా అంటావుగానీ నేను మెచ్చుకోండే నువ్వు ఎప్పుడైనా మెచ్చుకున్నావా?"

మాలతి విచిత్రంగా నవ్వి "సరే యీసారి నువ్వు నోరు వార వంతానే నేనుని మెచ్చుకోమంటావో చెప్పు" అంది.

స్త్రీలలోవున్న విచిత్రమైన గుణానికి యిప్పటికీ మాలతి కూడ మేలు కాదన్నాను. "అంతవరకు నువ్వమా ఇంత సౌందర్యంగా లేదు" అని చెప్పటమప్పుడు ప్రాంతి కలుగజేయటం వాళ్ళకలవాటు.

ముద్దుగా "మాలతీ! నువ్వు తెలివైనదానివేకాదు; అంతమైన దానివికూడా" అన్నాను నవ్వుతు.

"మహా నువ్వుమాత్రం అందమైనట్టు..." ఆ వాక్యం అంతటితో ఆగిపోయింది. తరువాత వాలిన కొంటెతనం కనిపించింది. బహుశా కోమలమైన ఆ చేతుల్లో ముఖాన్ని దాచుకోవాలని అని పించి వుంటుంది ఆమెకు. సిగ్గుతో ముందరవదనం శాగరంజిత మైంది.

నేను ఏమీ అనకుండా "ఛీ" అంది.

ఆ ఒక్కమాటతో నా మనసంతా సంపూర్ణమైనట్లుగా తోచింది. కాని నిర్భాగ్యుణ్ణి నేను. కిటికీ, ఆ ఛోంగనికి ఎన్నడూ పొత్తు కలవదు.

ఉంగరం యింకా మాలతి వ్రేలికే వుంది. "ఏదీ ఉంగరం! చూడాలనివుంది" అన్నాను.

ఆమె నిర్లక్ష్యంగా చేతిని ముందుకు పెట్టి "తీసుకో" అంది. సున్నితమైన ఆమెహస్తంనుండి ఉంగరాన్ని విడదీశాను. నా వ్రేలికి తొడిగాను.

"నాకన్నా నీకే బాగుంది" అంది.

"అవును. నల్లనిశరీరంమీద బంగారం మెరిసిపోతోంది."

"ఛీ, నువ్వు నల్లగా వుంటావని ఎవరు చెప్పారు?"

"మరి దీన్ని తెలుపంటారా ఏమిటి?"

అతికష్టంమీద నవ్వాపుకుంది. "నలుపైతేనేం? ఆ రంగు బాగానేవుంటుంది."

నా కింకా మాటలుచేరికాక "ఇచ్చిన వస్తువులు తీసుకోవటం మీ ఆచారం కాదుగా" అన్నాను.

"అని ఎవ్వరన్నారూ?"

"ఏమని?"

మాలతి కొంచం ఆలోచించి "తీసుకుంటామని" అంది.

"ఎవరూ అనలేదు కాబట్టే ఆమాట అన్నాను."

"అవును. ఆచారం కాదు."

"అయితే తీసుకుంటున్నాను."

ఆమె ఆశ్చర్యంగా చూసి "అది నీకు యిందాకే యిచ్చే కాను" అంది.

"నీకు నేను యింకో ఉంగరంయిస్తే దాన్ని ఏమంటావో తెలుసా?"

"పో."

"పోతున్నాను" అంటూ లేచి నిల్చున్నాను.

కంగారుగా ఆమె "అదేమిటి? అర్థాంతరంగా?"

"పొమ్మన్నావుగా."

చిన్న మొహం చేసింది

"అయితే నేను ఆకాశానంచేత పోవటంలేదు. అర్జంటు పని వుంది. మళ్ళీ రెండు రోజుల్లో కనిపిస్తాను" అని ఆమెకు నచ్చచెప్పి, బయటకు నడిచాను.

మళ్ళీ ఒకసారి నాపాత్ర చాలా నేర్పుగా నిర్వహించాను. ఇప్పుడు చాలావరకూ ప్రశాంతంగా వుంది. పదాలుబజారుకి వెళ్ళాను.

నిన్న జలపతిరావు ఉంగరాన్ని డెబ్బయిరూపాయలకు ఒకటో రెండో తక్కువగా కొన్నాడు. ఇవాళ అప్పుడే అయిదు రూపాయల ధర తగ్గింది. అరగంటలో పని ముగిసింది. జేబులోకి అరవైఅయిదురూపాయలు వచ్చాయి.

అక్కయ్యయిల్లు యిక్కడికి అరమైలుపైగా వుంది. నిన్న రాత్రి ఆమె నాదగ్గరకువచ్చి వెళ్ళాక ఏంజరిగిందో తెలియదు. నేనుతప్ప, రోగిష్టిబావ తప్ప ఎవరూలేని అక్కయ్య ఎలాంటి దుఃఖంలో వుండివుంటుంది. వెయ్యికళ్ళతో నేను వస్తానేమోనని ఎదురుచూస్తూ వుంటుంది. నిర్భాగ్యుడు బావ. అభాగ్యురాలు అక్కయ్య.

పావుగంట గడిచాక మలుపు తిరిగి ఓ గొందిలోకి ప్రవేశించాను. చీకటి సయ్యారం. వీధిదీపంకూడా లేదు. మనుషుల సంచిడి అసలేలేదు. రెండుసార్లు బురదలోకి కాలువేశాను. రెండుమూడు ఎదురు దెబ్బలు తగిలాయి. మురికికాలవ దుర్వాసన విపరీతంగా వుంది.

ఓ చిన్న పెంకుటింటిముందు ఆగాను.

లోపల గుడ్డిదీపం వెలుగుతోంది. చడీచప్పుడూ లేదు. తలుపుమీద కొడదామని చెయ్యివేశాను. దగ్గరగావేసి వున్నాయి, తెరుచుకున్నాయి.

మసకవెల్తుర్లో బావ నుక్కిమంచంమీద పడుకుని వున్నాడు. కంఠంవరకూ దుప్పటి కప్పివుంది. నిద్రలో వున్నాడో, తెలివితప్పి వున్నాడో తెలియదుగాని కళ్ళు మూసుకుని వున్నాయి. ప్రక్కన చాపమీద గోడకానుకుని అక్కయ్య మోకాళ్ళమీదుగా రెండు చేతుల్లో ముఖాన్ని దాచుకుని కూర్చునివుంది. సవ్వడి విని చేతులు తొలగించి చూసింది.

స్వరం బాగా చిన్నదిచేసి "అక్కయ్యా, ఎలావుంది?" అనడిగాను.

"ఆ విషయం నేనెలా చెప్పగలను?"

"మాట్లాడుతున్నాడా?"

"లేదు."

"స్మారకం వుందా?"

"అదీ లేదు."

"డాక్టరు వచ్చాడా?"

"రాలేదు."

ఆమెకళ్లు ఏడుపుకన్నా ఎర్రగా వున్నాయి. మనిషి చెప్పలేనంత క్షీణించిపోయింది.

నా కింకా ఏం మాట్లాడాలో తోచలేదు. కాలం వ్యర్థం చేయటం అంతకన్నా యిష్టంలేదు. "అయితే నేనువెళ్ళి డాక్టరుని పిల్చుకువస్తాను" అని ఆమె సమాధానంకోసం ఎదురుచూడకుండా బయటకు వచ్చేశాను.

[illegible] కైనా సమానం.

తర్వాత [illegible] అన్నాను.

"కాని [illegible]" అని చెప్పాడు.

రోగి [illegible] ... డాక్టరు వెళ్ళేసరికి మెడికల్‌షాపు మూసివేయబోతున్నాడు. ఎనిమిదియిరవైరూపాయలు వాటి ఖరీదు అని తెలిసింది. నాదగ్గర యిరవై తక్కువగా వున్నాయి. షాపు అతను నాకు తెలిసిన మనిషి కావటంచేత తర్వాత యిస్తానని ఒప్పించాను.

తిరిగి డాక్టరుని తీసుకుని, అక్కయ్య యింటికి వెళ్ళేసరికి మాకోసం ఎదురుచూస్తోంది. డాక్టరు అక్కడ ఓ అరగంట వుండి రెండు యింజక్షన్లు యిచ్చాడు. మళ్ళీ మరునాటి ఉదయంవచ్చి చూసివెళతానని చెప్పాడు. ఆయన్ని సందు మొదలువరకూ దిగబెట్టివద్దామని వెళ్ళాను.

"డాక్టర్! బ్రతుకుతాడంటారా?"

"రేపు కూడా ట్రీట్‌మెంటు పూర్తిఅయాక యిూసారికి ఏమీ భయంలేదు. కాని యిలా ఎన్నాళ్ళో జరగదు. మళ్ళీ అయిదారు నెలలయినా గడవకముందే రోగం తిరగబెడుతుంది. ఎలా అయినా యిలా ఎక్కువకాలం జరగదు."

నిట్టూర్పు అణుచుకున్నాను.

తర్వాత ఆయన్ని రిక్షా ఎక్కించి వెనక్కి తిరిగి వచ్చాను. "ఏమన్నాడు?" అనడిగింది అక్కయ్య కంపితస్వరంతో.

"భయం లేదుట."

పన్నెండింటివరకూ అక్కడే బావ ముఖంవంక చూస్తూ కూర్చున్నాను. సంవత్సరాల తరబడి మంచంమీద పడివున్నట్టే యివాళ పడివున్నాడు. అతనికోసం చేసుకున్న భార్య ఎన్ని తంటాలు పడుతుందో అతనికి తెలియదు. పోనీ అదీ మంచిదే. తెలిసి ఏం చెయ్యగలడు గనుక?

చివరకు భయంలేదని ఓదార్చి, ఆమెదగ్గర సెలవుతీసుకుని, బయటకు నడిచాను. చీకటి జీబూతంలా వుంది. మాసంలో, ఒక పక్షంలో కొన్నిరోజులు యిూ "రాజ" వీధికి విద్యుద్దీపాలు.

నాలో ఏదో సంతృప్తి. బహుశా నిన్నా, యివాళ మరుపురాని, మరువలేనిరోజులు. పెద్దవాడ్ని అయాక, వంటరిగా ఏ చీకటి రాత్రో యిలాగే ఎక్కడో నడిచిపోతూ "ఆరోజుల్లో...ఒక రోజు యిలాచేశాను" అనుకుంటానుకాబోలు.

"అయ్యో" అనిపించింది.

అసమర్థుడి గుండె ఎంతబరువు! పిరికివాడి ఆలోచనలు ఎంత ధైర్యవంతమైనవి!

ఎక్కడో వెలుగు. ఏదో కాంతి ఎక్కువసేపు నిలవలేదు. అంతరించిపోయింది వెంటనే.

"ఈ మనుషులు.......!" కోప్తిగా విరామం. "ఎంత అమాయకులు!"

"కాదు. ఎంత అజ్ఞానులు!"

అజ్ఞానమనే ఓ సముద్రంలో ముక్కరు మనుషులు పడిపోయి, యీదులాడుతున్నారు.

ఓ స్త్రీ అరుస్తోంది. కోపం జాలిగా ప్రేమగా "మధూ! మధూ! మధూ!"

అయ్యో! మధుర కలశం ఆమెను అందనన్ని, సముద్రంలో మరి కొంత సేపటిలో వెనుతుఫాను లేగబోతూందని గ్రహించదేం?

నిముషాలు విరామసంగీతాన్ని ఆలాపించాయి.

అరుస్తున్నాడు ఓ యువకుడు. "మాలతీ! మాలతీ! మాలతీ!"

నీళ్ళుమింగుతున్నాడు. ఒకసారి మునిగి పైకి తేలి "ఈ బహుమానం స్వీకరించవా?" అంటూ మళ్ళీ మునిగిపోయాడు.

ద్రోహంతో సంపాదించిన యీ బహుమానం వ్యర్థమేననీ, స్త్రీ హృదయం చాలా యిరుకైనదనీ, అందులో తనకు చోటు చాలదనీ గ్రహించడానికి ఎంత ఆత్మవిమర్శ కావాలో! తనకూ, ప్రేమించిన ఆమెకూ దూరం కొలవలేనిది అని యిప్పటిప్పుడే తెలియబోదు.

ఈ సారి విరామం మితంగా వుంది. యువకుడి ప్రార్థనలోనే మరో స్త్రీ ఏడుపూ వినిపిస్తోంది.

ఆ అపస్వరాలను కవిత తోడిగితే అర్థం యిలా వుంది.

బ్రతకాలి! బ్రతకాలి!! బ్రతకాలి!!!

బ్రతకడు. బ్రతకడు. బ్రతకడు.

విస్తారంలో వస్తున్న ఓ చిన్న నిద్ర. నిద్రలో కల. కలలో ఓ సముద్రం. సముద్రం పేరు అజ్ఞానం.

"మధూ! మధూ! మధూ!"

"మాలతీ! మాలతీ! మాలతీ!"

"బ్రతకాలి! బ్రతకాలి! బ్రతకాలి!"

సముద్రం మాయమయింది.

కల చెరిగింది.

నిద్ర విచ్చింది.

ఇల్లు సమీపించింది. పొరపాటున ఆర్పివేయకుండా విడిచి వచ్చిన దీపం వెలుగుతోంది. దానిలో లేని సుగంధం వికసించిన గులాబీహృదయమే గుర్తు.

నేను విజ్ఞానిని, విజ్ఞానిని.

ఆత్మవిమర్శ అపారం. పరహృదయాల జిగిబిగిని అవలీలగా అర్థం చేసుకుని, పర్యవసానాలు ముందుగా వూహించి, భయంకరమైన భావిని దూరదర్శినిలో పరిశీలించిన విజ్ఞానిని.

తలుపులు తీసి, బట్టలు మార్చుకుని, దీపం ఆర్పి, నిద్రకు ప్రయత్నం ఉపక్రమించాక హఠాత్తుగా ఓ క్రొత్త ఆలోచన మతిని చలింపచేసింది.

ఆశ్రయించిన నిర్భాగ్యులను అంధకారంలోనే వుంచి, అజ్ఞానాన్ని అజ్ఞానంగానే సమాప్తం చేస్తూ, అజ్ఞాతంగా, విజ్ఞానమనే యీ గర్వంతో, చేతగానితనానికి మారుపేరైన యీ గర్వంతో, వెలుగును దరిచేరటానికి జేగించని యీ పిరికితనంతో కుమిలి, కుళ్ళేది నాది జ్ఞానమా?

నేను అజ్ఞానిని, అజ్ఞానిని.